

'గిరి' గూడేలకు పండుగ శోభ
'గిరి' గూడేలకు పండుగ శోభ వచ్చేసింది. ఆషాఢమాసంలో వచ్చే అకాడితో ప్రారంభ మయ్యే పండుగలు, ఉత్సవాలు దీపావళితో ముగుస్తాయి. 8లో ▸



ఘనంగా బోనాల సంబురాలు
జిల్లాలోని పలు పాఠశాలల్లో శనివారం బోనాల సంబురాలు నిర్వహించారు. విద్యార్థులు నెత్తిన బోనాలు, పోతురాజు వేషధారణతో ఆకట్టుకున్నారు. 9లో ▸

గరిష్టం/కనిష్టం
33.0/26.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అల్పపీడన ప్రభావంతో పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

పెద్ద సదువులు దగ్గరైతయ్..

వదిన వంటయిందా..? అంటూ సరస్వతిని పిలుచుకుంటూ వచ్చింది ఎదురింటి లక్ష్మి. ఇంకా కాలేదమ్మ మా పెద్దోనితోని ఫోన్ మాట్లాడి ఇప్పుడే అన్నం పెట్టిన. మంచిగ చదువుకొమ్మని పట్నంల చదివిస్తంటే వాడు తిప్పలైతందంటుండు. పెద్ద సదువులేమో ఈడ లేకపాయే. ఏం జేయాల్నో తోస్తలేదు అంటుండగా.. అగో వదినామరదండ్లు ఏమో ముచ్చట్ల పద్దరంటూ పక్కింటి జంగుబాయి అక్కడికి చేరింది. ఏం లేదక్క.. వాళ్ల పెద్దోని గురించి చెప్తంది. నువ్వు కూడా ఏడికో పోయొస్తున్నట్లువు అంటూ అడిగింది లక్ష్మి. కరీంనగర్ పోయొస్తున్నమక్క. మా చిన్నోడు ఆడనే సదువుతున్నడుగా. వాని పానం మంచిగా లేదంటే ఇద్దరం పోయి చూసొస్తున్నం అంది జంగుబాయి. అవ్.. ఈడనో పెద్ద సదువులు లేకపాయే.. దూరం పోతేనో పోరగాండ్లకు తిప్పలు కావట్టే. అందుకేనేమో మొన్న గా 'సాక్షి' పేపరోళ్లు ఇక్కడే యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని మీటింగ్ పెట్టిన్రట. మన స్రవంతి కూడా పోయిందాడికి. చానా మంది వచ్చిన్రట.. విశ్వవిద్యాలయం ఇక్కడ ఏర్పాటైతే ఏమేం మంచి జరుగుతదో అందరూ మాట్లాడిన్రట. ఓ కమిటీ కూడా వేసిన్రట. వాళ్లు కూడా ప్రభుత్వ పెద్దలను కలిసేందుకు రెడీ అయిన్రట. అనుకున్నట్లు యూనివర్సిటీ వస్తే మన పిలగాండ్లకు పెద్ద చదువులు దగ్గరైతై.. ఈడనే మంచి నౌకర్లస్తయ్.. అని లక్ష్మి అనగానే.. అది సాధ్యమయ్యేనా అంటూ జంగుబాయి, సరస్వతి మాటకలపడంతో ముచ్చట షురూవైంది.

– ఆదిలాబాద్

- మన పిల్లలకు ఈడనే నౌకర్లొస్తయ్..
- యూనివర్సిటీ వస్తే లాభాలెన్నో..
- విశ్వవిద్యాలయ సాధనపై 'మహిళల ముచ్చట'



జంగుబాయి: అవ్ యూనివర్సిటీ అంటే పెద్ద సదువులు ఉంటయంటున్నవ్.. దానికి తగ్గట్టు బిల్డింగ్‌లు ఉండొద్దా మరి. అవి మనకాడ కద్దరా.. ఈడ సాలత్‌లున్నయా.. ప్రభుత్వం సాంక్షన్ చేస్తదా..?

లక్ష్మి: గట్ల అంటవ్ ఏందక్క. మనకేం తక్క. మన కాడ ఎంతో పెద్ద జంగల్ ఉన్నది.. నేషనల్ హైవే 44 మన జిల్లా మీదికెంచే పోతది. ఎయిర్‌పోర్టు కూడా కట్టతందుకు మొన్న కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందట. అది కాకుండా వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆదిలాబాద్‌ల రిమ్స్ దవాఖాన కట్టలేదా. ప్రభుత్వాలు తలుచుకుంటే విద్యాసంస్థలు ఎందుకు కట్టరు? తప్పకుండా కడతరు. చదువులు కూడా చెప్తరు.

సరస్వతి: ఏండ్ల సంది మన ఎదులాపురంను ఎనకబడ్డ జిల్లా అనుకుంటా మొత్తానికే ఎనకపడేసింద్రు. ఇప్పుడు యూనివర్సిటీ పెడతరంటవా..?

జంగుబాయి: అవ్ సరస్వతక్క సెప్పింది కూడా నిజమే అనిపస్తంది. సాధ్యమైతదంటవా..

లక్ష్మి: ఎనకబడ్డ ఇలాఖాల్లోనే విద్య అవసరం ఎంతో ఉంటది. అందుకే సర్కారోళ్లు కూడా నజర్ పెట్టి పెద్ద విద్యాసంస్థలు పెట్టేందుకు చూస్తరు. తెలంగాణల ఉమ్మడి పది జిల్లాలను చూస్తే దాదాపు ప్రతీ జిల్లాల యూనివర్సిటీ ఉన్నది. ఒక్క మన ఆదిలాబాద్‌ల తప్ప. 'సాక్షి' పేపరోళ్లు పెట్టిన మీటింగ్ ద్వారా ఏర్పడైన కమిటీ ప్రభుత్వం దగ్గరికి విషయం తీసుకుపోయేందుకు రెడీ అయిందట. పార్టీలకతీతంగా అందరూ కలిసి పోతున్నరట. సాంక్షన్ అయితే మన పిలగాండ్లు ఈడ్నే చదువుకొని మంచి కొలువులు చేస్తరు.

జంగుబాయి: యూనివర్సిటీ కడితే చదువు చెప్పుడే కాకుండా నౌకర్లు కూడా ఇస్తరా అక్క?

లక్ష్మి: యూనివర్సిటీ వస్తే వేల సంఖ్యలో పిలగాండ్లు పట్టభద్రులైతరు. మామూలు డిగ్రీలే కాకుండా ప్రొఫెషనల్ పట్టాలు కూడా పొందుతరు. బయట దేశాలకు కూడా పోతరు. ఇప్పుడు మన రిమ్స్ మెడికల్ కాలేజీలో పిలగాండ్లు ఎంబీబీఎస్ చదువుతలేరా గట్లనే. ఇంజినీరింగ్, లా, పీజీ, పీహెచ్‌డీ వంటి పెద్ద పెద్ద చదువులు మన పిల్లలు చదువుతరు. హైదరాబాద్‌ల ఉన్న ఉస్మానియా యూనివర్సిటీ లెక్క అన్నమాట.

సరస్వతి: గట్లాంటప్పుడు ఇప్పటిదాకా యూనివర్సిటీ ఎందుకు కట్టలే. అది ఉంటే మన పిల్లలు అంత దూరం పోయి వాళ్ల తిప్పలపడకపోవు.. మనం కూడా బాధపడకపోవు కదా!

లక్ష్మి: మనం మాత్రం అనుకుంటేనే అయితదా వదినే! మన పిలగాండ్లు గట్టిగా అనుకోవాలి. అట్లనే విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు, సామాజిక కార్యకర్తలు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, మీడియా ఇలా ప్రతి ఒక్కళ్ల గట్టిగా సర్కారును అడిగితే గప్పుడు యూనివర్సిటీ బరాబర్ అస్తది.

సరస్వతి: అవ్ లక్ష్మి నువ్వన్న దాంట్లో కూడా తప్పు లేదు. అందరూ గట్టిగా అనుకొని రోడ్లమీ దకి వస్తేనే మన తెలంగాణ అచ్చింది. గట్లనే యూనివర్సిటీ కూడా వస్తది. నువ్వు కూడా ఏదో డిగ్రీ చదివిన అంటివి? పీజీల సీటొస్తే మీటళ్ల దూరమైతదని వరంగల్ పంపలే అంటివి. నువ్వు గిట్ల చదివితే మంచి నౌకరిస్తుండే.

లక్ష్మి: అన్నీ మనకు అనుకున్నట్లు జరుగుతాయా వదిన. తల్లిదండ్రులకు కూడా భయం ఉంటది కదా. అందులోనూ ఆడపిల్లల విషయంలో గుబులు ఎక్కువ. అదే మన జిల్లాలోనే యూనివర్సిటీ వస్తే ముఖ్యంగా ఆడపిల్లలు సక్కగా చదువుకోడానికి సొలత్ అయితది.

సరస్వతి: మా అప్పుడు గిన్ని సదువులు చెప్పే బడులు లేకుండే లక్ష్మి. ఉన్నవడితే నేను సదివే దాన్ని. సిన్నగున్నపుడే లగ్గం జేసీ పగ్గం మీ అన్నకు ఇచ్చిరి.

లక్ష్మి: ఇప్పుడు రోజులు మారినయ్. ఆడపిల్లలకు జల్ది లగ్గం అంటే ఆలోచిస్తున్నరు. అయిన గని మారుమూల ప్రాంతాల్లో పెండ్లిళ్లు చేస్తుంద్రు. అవి ఆగాలన్నా.. మనం గొప్పగా ఎదగాలన్నా చదువుతూనే అయితది. మనకు విశ్వవిద్యాలయం వస్తేనే మార్పు వస్తది. మనం కూడా మన పిల్లలకు ఇమ్మత్ ఇయ్యాలే. యూనివర్సిటీ వచ్చేదాకా కొట్లాడాలి.

జంగుబాయి: నా పిల్లగాండ్లు, నీ పిల్లగాండ్లు పెద్దగయ్యేవరకు మనకు ఈడ యూనివర్సిటీ ఉంటే సక్కగా సదువుకుని, మన కండ్ల ముందే నౌకర్ చేస్తరు. వాళ్ల కోసం అయినా మనం కూడా కొట్లాడాలె. నేను ఎప్పుడు రమ్మంటే అప్పుడొస్తా.

సరస్వతి: లక్ష్మి, జంగు.. మీతో పాటు నేను కూడా వస్తా.. పోరాటం చేస్తా..

అయ్యో పొయ్యిమీద అన్నంపెట్టి నంటినవ్ వదిన.. మాడు వాసన వస్తంది. చూడుపో.. అనగానే సరస్వతి అయ్యో నేను మరిచే పోయిన అంటూ గ్యాస్ కాడికి వెళ్లడంతో మిగతా ఇద్దరూ ఎవరింటికి వారు వెళ్లారు.

న్యూస్‌రీల్

ఆర్డీవో వినోద్‌కుమార్‌కు ఆత్మీయ వీడ్కోలు



బాధ్యతలు స్వీకరిస్తున్న స్రవంతి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ ఆర్డీవో బి.వినోద్‌కుమార్ శనివారం తన బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో విధుల్లో చేరిన ఆయనను రాష్ట్ర ఎన్నికల సంఘానికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో నిజామాబాద్ బీసీ సంక్షేమాధికారి స్రవంతిని నియమించింది. దీంతో ఆమె బాధ్యతలు స్వీకరించారు. కాగా విధుల నుంచి రిలీవ్ అయిన ఆర్డీవోకు శనివారం రాత్రి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా తదితరులు శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఆయన సేవలను కొనియాడారు. ఇందులో కలెక్టరేట్ ఏవో వర్ణ, తహసీల్దార్లు,ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణార్థులకు డీజీపీఎస్‌పై అవగాహన

కైలాస్‌నగర్: సర్వే ల్యాండ్ రికార్డుశాఖ ఆధ్వర్యంలో లైసెన్స్‌డ్ సర్వేయర్లకు అందిస్తున్న వృత్తిపరమైన శిక్షణలో భాగంగా శనివారం డిఫరెన్షియల్ గ్లోబల్‌పొజిషనింగ్ సిస్టమ్(డీజీపీఎస్)పై అవగాహన కల్పించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ఏ విధంగా భూ సర్వే నిర్వహించాలనే దానిపై ప్రత్యక్షంగా వివరించారు.కొలతల్లో ఖచ్చితత్వం, జీపీఎస్ ద్వారా సరిహద్దులు గుర్తించేందుకు ఈ విధానం దోహదపడుతుందని సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రాజేందర్ అన్నారు. శిక్షణార్థులు దీనిపై పట్టు సాధించి రాణించాలని సూచించారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

ఆదిలాబాద్‌టౌన్: పోరాటాలతోనే ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కారమవుతాయని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మూగ శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని పలు పాఠశాలల్లో శనివారం సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయ సమస్యలపై ఎప్పటికప్పుడు ఎస్టీయూ రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జాదవ్ అశోక్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెజ్జంకి రవీంద్ర, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, ఆదిలాబాద్ అర్బన్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్, పాచ్చారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంద్‌కు కొలాం మద్దతు

ఉట్నూర్‌రూరల్: జీవో 49 రద్దు చేయాలని కోరుతూ తుడుందెబ్బ, ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం తలపెట్టిన ఉమ్మడి జిల్లా బంద్‌కు కోలాం సేవాసంఘం మద్దతు ఇస్తుందని మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొడప బాపురావు, సిడాం బాపురావు తెలిపారు. ప్రజలు బంద్‌కు సహకరించాలని కోరారు.

లస్కర్లు వస్తున్నారు

- ప్రాజెక్టు కాలువల పర్యవేక్షణకు..
- నీటిపారుదల శాఖలో ఔట్‌సోర్సింగ్ నియామకానికి అడుగు

ఎస్ఈల పరిధిలో పోస్టుల సంఖ్య ఇలా..
ఆదిలాబాద్ చీఫ్ ఇంజినీర్ : 72
మంచిర్యాల చీఫ్ ఇంజినీర్ : 67



సాక్షి, ఆదిలాబాద్: లస్కర్ (మ్యాన్ మజ్దూర్) ఈ పదం రెండు దశాబ్దాల క్రితం నీటి ప్రాజెక్టుల వద్ద సాధారణంగా వినిపించేది. ప్రతీ రైతుకు తమ పరిధిలోని కాలువకు సంబంధించి లస్కర్ పేరు వారి నోట్లో నానేది. అప్పుడు ఇవీ రెగ్యులర్ పోస్టులు. అంతే కాకుండా నిరంతరంగా కాలువల వద్ద బాధ్యతగా విధులు నిర్వహిస్తు అన్నదాతకు చేదోడువాదోడుగా నిలిచేవారు. అలాంటిది రెగ్యులర్ పోస్టుల్లో ఉన్న లస్కర్లు రిటైర్డ్ అవ్వడం, ప్రభుత్వం కొత్త వారిని నియమించకపోవడంతో రానురాను ఈ పదం దాదాపుగా కనుమరుగైంది. ఈతరం వారి కి అసలు అలాంటి పోస్టు ఉంటుందనేదే తెలి యదు. ప్రస్తుతం రెగ్యులర్‌గా వేళ్లమీద లెక్కపెట్టే సంఖ్యలోనే ఉండటం గమనార్హం. ఇప్పుడు ఈ విషయాలన్నీ ఎందుకు వచ్చాయంటే.. ప్రభుత్వం మళ్లీ ఔట్ సోర్సింగ్ పద్ధతిన లస్కర్ పోస్టు నియామకానికి రంగం సిద్ధం చేసింది. ఇక ప్రాజెక్టుల కింద కాలువలపై వీరి సందడి కనిపించనుంది. రైతులకు సాగు నీరందించే ఆయా ప్రాజెక్టులకు సంబంధించి కాలువల పర్యవేక్షణ కోసం గతంలో ఇరిగేషన్ శాఖలో కింది స్థాయిలో లస్కర్లు ఉండేవారు. ప్రాజెక్టులు నిండిన, నిండకపోయినా.. సాగునీరు విడుదలైన, కాకపోయినా.. ఈ లస్కర్లు కాలువలపైనే విధులు నిర్వర్తించేవారు. ఒక్కో ప్రాజెక్ట్ పరిధిలో పదుల సంఖ్యలో పోస్టులు ఉండేవి. అయితే ఇప్పుడు ఆ పదమే మర్చిపోవాల్సిన పరిస్థితి. ఆ శాఖలో పనిచేసే సీనియర్ అధికారులకు తప్ప ఇటీవల విధుల్లో చేరిన కొత్త వారికి లస్కర్ అంటే అర్థం తెలియని పరిస్థితి. గతంలో పనిచేసిన వారు వయస్సుపైబడి కొందరు పదవీ విరమణ పొందగా, మరికొందరు ప్రాణాలను కోల్పోయారు. జిల్లాలోని సాత్నాల మధ్య తరహా ప్రాజెక్టులో ప్రస్తుతం ఒకే ఒక్క రెగ్యులర్ లస్కర్ నగేశ్ పనిచేస్తుండడం గమనార్హం. ఆయన రిటైర్మెంట్ కూడా త్వరలోనే ఉంది.

కాలువలపై పర్యవేక్షణ లేక..

లస్కర్‌పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఏళ్లుగా ప్రాజెక్టుకాలువలపై నీటిపారుదలశాఖ పర్యవేక్షణ కనుమరుగైందన్న ఆశ్చర్య పోనవసరం లేదు.కా లు వ లు ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి. కొన్ని చోట్ల కబ్జాకు కూడా గురవుతున్నాయి. శాఖా అధికారులు ఆఫీసులు వదిలి బయటకు రాకపోవడం, వచ్చిన నీటి విడుదల జరిగినప్పుడు మొక్కుబడి పర్యవేక్షణ తప్ప పూర్తిస్థాయిలో తిరిగే పరిస్థితి లేవు.

> **గతంలోనే ప్రతిపాదనలు పంపాం**
>
> లస్కర్ల నియామకానికి సంబంధించి గతంలోనే ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా ముందుకు వెళ్తాం. ప్రధానంగా కాలువల పర్యవేక్షణ లస్కర్ల బాధ్యత.
>
> – మధూసుదన్ రెడ్డి, ఆదిలాబాద్ ఇన్‌చార్జి ఎస్ఈ

నియామకాలకు రంగం సిద్ధం..

రాష్ట్రప్రభుత్వం శనివారం జీవో ఆర్‌టీనంబర్ 1212 విడుదల చేసింది. నీటి పారుదలశాఖలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ రకాల పోస్టులను ఔట్ సోర్సింగ్ పద్ధతిన నియమించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. అందులో లస్కర్ పోస్టులు కూడా ఉన్నాయి. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో తీసుకునే వారిని ఏడాది పాటు కొనసాగించనున్నారు. తర్వాత ప్రభుత్వ నిర్ణయానికనుగుణంగా పొడిగింపు అవకాశముంది.

విద్యార్థులతోనే సమాజంలో మార్పు

- కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్‌రూరల్: విద్యార్థులతోనే సమాజంలో మార్పు ఉంటుందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మండలంలోని అంకోలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఆరోగ్య పాఠశాల జాతర, గ్రామసభ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా వన మహోత్సవంలో భాగంగా మొక్క నాటారు. అనంతరం ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా స్టూడెంట్ చాంపియన్లకు సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థి దశలోనే మంచి నడవడిక అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజ నం చేశారు. ఇందులో డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి పద్మభూషణ్‌రాజు, డీఆర్డీవో రవీందర్ రాథోడ్, ఎంపీడీవో స్వప్న శీల, మండల విద్యాశాఖ అధికారి నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఈవీఎం గోడౌన్ తనిఖీ

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో గల ఈవీఎంలు భద్రపర్చిన గోడౌన్‌ను కలెక్టర్ రాజర్షి షా శనివారం సందర్శించారు. నెలవారీ తనిఖీలో భాగంగా ఈవీఎంల స్థితిగతులను స్వయంగా పరిశీలించారు. సిబ్బందితో మా ట్లాడి భద్రతాపరంగా పలు సూచనలు చేశారు. ఆయన వెంట కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ పంచపూల ఉన్నారు.

గుడ్ల సరఫరాపై ప్రీ బిడ్ సమావేశం

కైలాస్‌నగర్: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు, సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీలు, సంక్షేమ వసతిగృహాల్లో కోడి గుడ్ల సరఫరాకు సంబంధించి శనివారం ప్రీబిడ్ సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ రాజర్షి షా అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశానికి పెద్దపల్లి, నిర్మల్, కామారెడ్డి, నిజామాబాద్, సిద్దిపేట, హైదరాబాద్ జిల్లాలకు చెందిన కోళ్లఫారాల యజమానులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, టెండర్ నిబంధనలను స్పష్టం చేశారు. అలాగే యజమానుల సందేహాలను నివృత్తి చేశారు. ఆసక్తి గల వారు ఈ నెల 24వరకు ఆన్‌లైన్‌లో ప్రీబిడ్ సమర్పించాలని పేర్కొన్నారు. ఇందులో ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా, డీఎస్సీడీఓ సునీత కుమారి, బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజలింగు, డీడబ్ల్యూవో మిల్కా, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు

- ఎంపీ నగేశ్

ఆదిలాబాద్‌రూరల్: విద్యార్థులు ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. మండలంలోని మామిడిగూడ బాలికల ఆశ్రమ పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. వన మహోత్సవంలో భాగంగా ఆవరణలో మొక్క నాటారు.అనంతరం ఈఏడాది పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, ఏకాగ్రతతో ఇష్టపడి చదివితే భవిష్యత్‌లో ఉన్నత స్థానాలు అధిరోహించవచ్చన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చా రు. ఇందులో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ జెడ్పీటీసీ మడావి రాజు, ప్రధానోపాధ్యాయులు శైలజ, అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ గులాబ్, మధుసూదన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సన్మానం పొందిన విద్యార్థులతో ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే శంకర్

స్థానిక ఎన్నికలకు సమాయత్తం కావాలి

ఆదిలాబాద్: బీజేపీ కార్యకర్తలంతా స్థానిక ఎన్నికలకు సమాయత్తం కావాలని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల వర్క్‌షాప్‌లో ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలను పరిష్కరించినప్పుడే లోకల్ బాడీ ఎన్నికల్లో విజయం సాధ్యమవుతుందన్నారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త సైనికునిలా పాటుపడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, సీనియర్ నాయకులు అల్జాపూర్ శ్రీనివాస్ తదితరులున్నారు.

కేసుల ఫైలింగ్‌లో జాగ్రత్తలు పాటించాలి

ఆదిలాబాద్‌టౌన్: కోర్టు కేసుల్లో న్యాయవాదుల గుమాస్తాల పాత్ర కీలకమైందని, కేసులను ఫైలింగ్ చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని జిల్లా జడ్జి కె. ప్రభాకరరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల న్యాయవాదుల గుమాస్తాలకు ఈ ఫైలింగ్‌పై శనివారం అవగాహన కల్పించారు. రిసోర్స్‌పర్సన్లు సాయికుమార్, రవి కేసులను ఏ విధంగా ఫైల్ చేయాలనే దానిపై ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ కేసుల వివరాలను ఎప్పటికప్పుడు ఫైలింగ్ చేసేందుకు సుప్రీంకోర్టు ఈ ఏడాది జనవరిలో ఈ ఫైలింగ్ విధానం అమల్లోకి తెచ్చిందన్నారు. పైలెట్ ప్రాజెక్ట్‌గా ఆదిలాబాద్ జిల్లా ఎంపికైందని, ఈ విధానంలో మన జిల్లానే ముందుందన్నారు. గుమాస్తాలు మరింత బాధ్యతతో ఈ ఫైలింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేశ్, ఏవో సూర్యకాంత్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

అదిలాబాద్‌టౌన్: జిల్లాలోని నాలుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఉర్దూ మీడియంలో బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ పోస్టులు ఒక్కోటి చొప్పున, ఇంగ్లీషు- 2, కంప్యూటర్ సైన్స్ -2, హిందీ- 2, ఉర్దూ-1, జువాలజీలో-3 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్, కంప్యూటర్ అప్లికేషన్, మ్యాథమెటిక్స్‌లో ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్, ఎకనామిక్స్‌లో మూడు చొప్పున, ఇంగ్లీషులో నాలుగు, హిందీలో ఒకటి, హిస్టరీలో రెండు, మ్యాథమెటిక్స్‌లో రెండు, ఫిజిక్స్‌లో రెండు, పొలిటికల్‌లో సైన్స్ మూడు, తెలుగు నాలుగు, జువాలజీ రెండు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలలో అరబిక్, తెలుగు, హిందీ, ఇంగ్లీష్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఒక్కోటి చొప్పున, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, కామర్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్ పోస్టులు రెండేసి చొప్పున, ఎకనామిక్స్ ఉర్దూ ఒక పోస్టు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ పోస్టులకు గాను ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ ఆదిలాబాద్ కళాశాలలో ఈ నెల 23న, ఉట్నూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 24న, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్, ఇచ్చోడ ప్రభుత్వడిగ్రీ కళాశాలలో 25న అభ్యర్థులకు డెమో నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన వారు హాజరుకావాలని సూచించారు.

'వీపీవో' అమలు చేయాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌రూరల్: ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో గల వార్డులు, గ్రామాల్లో విలేజ్ పోలీస్ ఆఫీసర్ విధానం కచ్చితంగా అమలు చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. మావల పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలన్నారు. అలాగే సమయపాలన పాటించాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులపై గౌరవంగా వ్యవహరించాలన్నారు. స్టేషన్‌లో నమోదైన కేసులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ కోర్టులో చార్జిషీటు దాఖలు చేయాలన్నారు. స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా సిబ్బంది ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలన్నారు. డయల్ 100 సిబ్బంది సంఘటన స్థలాలకు వీలైనంత త్వరగా చేరుకొని బాధితులకు భరోసా కల్పించాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, సీఐ కర్రె స్వామి, ఎస్సైలు ప్రవీణ్, రాజశేఖర్ రెడ్డి, యూనస్, ఏఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఏపీకే ఫైల్స్, తెలియని వెబ్‌సైట్లతో జాగ్రత్తగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: ఇన్వెస్ట్‌మెంట్‌ఫ్రాడ్స్, ఏపీకే ఫైల్స్, నకిలీ వెబ్‌సైట్స్, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ వంటి నూతన పద్ధతులలో మోసం చేస్తున్న సైబర్ నేరగాళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ ఓ ప్రకటనలో సూచించారు. మోసపోయినట్లు గ్రహించిన వెంటనే హెల్ప్‌లైన్ నంబర్ 1930కు సమాచారం అందించాలని తెలిపారు. అప్రమత్తతతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని పేర్కొన్నారు. సోషల్ మీడియాలోవచ్చే ఏపీకే ఫైల్స్ క్లిక్ చేస్తే మొబైల్ కంట్రోల్‌సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళుతుందని తెలిపారు. వారంవ్యవధిలో జిల్లావ్యాప్తంగా 9 ఫిర్యాదులు అందినట్లు పేర్కొన్నారు.

జిల్లా ఉద్యానవన అధికారిపై సస్పెన్షన్ వేటు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి ఎస్.సుధాకర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. కరీంనగర్ జిల్లాలో సెరికల్చర్ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన జిల్లా ఇన్‌చార్జి అధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. ఇది వరకు పనిచేసిన అధికారి సస్పెండ్ కావడంతో ఏడాదిన్నరగా ఇన్‌చార్జి బాధ్యతల్లో కొనసాగుతున్నాడు. అయితే కార్యాలయంలో హెచ్ఈవోగా విధులు నిర్వహిస్తూ గత జూన్‌లో ఉద్యోగ విరమణ పొందిన స్వామికి సంబంధించిన పెన్షన్‌కు నాన్ డ్రాయల్ సర్టిఫికెట్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. పెన్షన్ మంజూరైనప్పటికీ అందుకు సంబంధించిన పత్రాలు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నాడు. ఈ విషయమై బాధితుడు ఆ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు. విచారణ జరిపిన ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలుస్తోంది. అలాగే గతంలో పనిచేసిన స్థానంలో కూడా పలు పొరపాట్లపై వేటు పడినట్లుగా సమాచారం. ఈయన స్థానంలో రాష్ట్ర కార్యాలయంలో పనిచేస్తున్న నర్సయ్యకు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది.

క్లుప్తంగా

కౌలురైతు బలవన్మరణం


గజేందర్ (ఫైల్)

కుంటాల: కుంటాలకు చెందిన కౌలు రైతు రాజారాం గజేందర్ (49) అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం తెల్లవారుజామున స్థానిక ఉన్నత పాఠశాల సమీపంలోని పంట చేనులో చెట్టుకు ఉరేసుకున్నాడు. ఏఎస్సై జీవన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. గజేందర్ మూడేళ్లుగా 10 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వరి, మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్నాడు. అయితే, ఆశించిన మేర దిగుబడి రావడం లేదు. దీంతో పెట్టుబడి, కౌలు చెల్లింపు కోసం అప్పులు చేశాడు. వచ్చిన దిగుబడి అప్పులు, వడ్డీలకు సరిపోవడం లేదు. ఇప్పటికీ రూ.3.60 లక్షల అప్పు ఉంది. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో ఖరీఫ్ సాగు ఆశాజనకంగా లేదు. దీంతో మనస్తాపం చెందిన గజేందర్ అప్పులు ఎలా తీర్చాలన్న బెంగతో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. గజేందర్ తండ్రి రాజారాం బక్కన్న ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

స్థల వివాదంలో ఒకరికి కత్తిపోట్లు


తలకు గాయంతో చిన్నయ్య

సోన్: స్థల వివాదంలో ఒకరిని కత్తితో పొడిచిన సంఘటన మండలంలోని న్యూబొప్పారంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన వేముల శ్రీనివాస్ తన ప్లాటును అదే గ్రామానికి చెందిన వేరే వ్యక్తికి విక్రయించాడు. తనను కాదని ఎలా అమ్ముతావని వరుసకు మేనమామ అయిన కనికరం చిన్నయ్య అడిగే క్రమంలో ఇరువురి మధ్య తోపులాట జరిగింది. దీంతో చిన్నయ్య శ్రీనివాస్‌పై కారంపొడి చల్లి కత్తితో పొడిచాడు. శ్రీనివాస్ కోపంతో చిన్నయ్య తలపై కర్రతో కొట్టడంతో గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఇద్దర్ని వేరువేరుగా అంబులెన్స్‌లో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై గోపి తెలిపారు.


కత్తిపోట్లకు గురై చికిత్స పొందుతున్న శ్రీనివాస్

గిరి గూడేలకు పండుగ శోభ

ఆకిపేన్..


రేఖ దాటి అడవిలోకి వెళ్తున్న పశువులు

అడవిలో ఆకులు చిగురించి పచ్చగా మారుతున్న క్రమంలో ఆదివాసీలు ఆకిపేన్‌కు పూజలు చేస్తారు. ఈ కాలంలో అడవికి వెళ్లిన మూగజీవాలకు రక్షణగా ఉండాలని, ఎలాంటి హాని తలపెట్టవద్దని, పంటలు అధికదిగుబడి సాధించాలని పూజలు చేస్తారు. ఈ సందర్భంగా లక్ష్మణరేఖ లాంటి గీతను గీస్తారు. ప్రత్యేకంగా తయారు చేసిన తుర్రను ఊదడంతో పశువులు అడవిలోకి పరుగెత్తాయి. కోడి, మేకలతో జాతకం చెబుతారు.

విజ్జపేన్..!

పెర్సాపేన్, రాజుల్‌దేవత వద్దకు విత్తనాలను తీసుకెళ్లి పూజలు చేస్తారు. పంటలకు ఎలాంటి హాని కలగకుండా చూడాలని పెర్సాపేన్‌కు మొక్కుతారు. అంతకు ముందు గ్రామంలో ఉన్న విత్తనాలను ఒక వద్దకు చేర్చి కుల దేవతలకు అందరు కలిసి పూజలు నిర్వహిస్తారు. అనంతరం కటోడా వాటిని అందరికీ అందిస్తారు. ఆ తర్వాతే పొలం పనులు ప్రారంభిస్తారు.


పెర్సాపేన్‌కు మొక్కుతున్న ఆదివాసీలు

వన భోజనాలు


పెద్ద సాకడలో ఆకిపేన్ వద్ద పూజలు

వనాలతో అతి సాన్నిహిత్యమున్న ఆదివాసీలు అకాడిలో వనదేవతకు ప్రత్యేక పూజలు చేస్తారు. గ్రామ పొలిమేరలో ఉన్న బాబ్రి చెట్టుకింద దేవతల ప్రతిమలను శుద్ధి చేస్తారు. పుసుపుతో గీతలు గీస్తారు. గీత ఎదుట బియ్యంపోసి రాజుల్‌పేన్‌కు పూజలు చేస్తారు. అక్కడే వండిన నైవేద్యాన్ని ఉండలుగా చేసి అడవిదేవతకు చూపిస్తారు. పొలం పనులు చేస్తుండగా వన్యమృగాలు, విషజంతువులు తమదరికి చేరవద్దని మొక్కుతారు.

‘శీత్ల’ పండుగ

శీత్ల భవాని లంబాడీల దేవత. పశువుల ఆరోగ్యం, తండా సౌభాగ్యం కోసం శీత్ల భవానికి పూజలు చేయడం లంబాడీల ఆనవాయితీ. కలరా వంటి వ్యాధుల బారి నుంచి కాపాడుతుందని వారి నమ్మకం. ఆషాఢమాసంలో ఒక మంగళవారం గ్రామ సరిహద్దులోని పొలిమేరలో ఉన్న కూడలి వద్ద శీత్ల భవానీని ప్రతిష్ఠిస్తారు. మహిళలు, యువతులు నెత్తిన బోనం ఎత్తుకుని వస్తారు. నైవేద్యంగా పాయసం సమర్పిస్తారు. కోళ్లు, మేకలను బలిచ్చి వాటిపైనుంచి పశువులను దాటిస్తారు. పశు సంపద వృద్ధి చెందాలని, పాడిపంటలు బాగా పండాలని, ఎలాంటి దుష్టశక్తులు దరి చేరకుండా ఉండాలని శీత్ల మాతను పూజిస్తారు.

- ఆదివాసీ సంస్కృతి.. సంప్రదాయాల సౌరభం
- నాలుగు మాసాలు వివిధ పండుగలు
- అకాడితో ప్రారంభమై దీపావళితో ముగింపు
- కుల దేవతలకు ప్రత్యేక పూజలు
- ఆదివాసీ పల్లెల్లో కోలాహలం


మేకతో జాతకం చూస్తున్న ఆదివాసీలు

కెరమెరి(ఆసిఫాబాద్): మారుతున్న ఆధునిక కాలంలోనూ ఆదివాసీలు తమ ఆచారాలు, సంప్రదాయాలు కొనసాగిస్తున్నారు. సమాజంలో ఎన్నో మార్పులు వస్తున్నప్పటికీ ఆదివాసీలు నేటికీ పుడమితల్లిని పూజిస్తూ కాలం వెల్లదీస్తున్నారు. పండుగలు, పెళ్లిళ్లు, సంస్కృతి, ఆచార వ్యవహారాల్లోనూ.. తమకు మరెవరూ సాటిరారని నిరూపిస్తున్నారు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీలు. వారి ఇళ్లల్లో జరిగే వివాహాల్లో వైవిధ్యం ఉంటుంది. నూతనత్వం కనిపిస్తుంది. పండుగల్లోనూ కొత్తదనం కనిపిస్తుంది. ఆషాఢ మాసంలో వచ్చే అకాడి పండుగతో ప్రారంభమయ్యే ఆదివాసీల పండుగలు, ఉత్సవాలు దీపావళితో ముగుస్తాయి. నాలుగు మాసాల పాటు ఆదివాసీ గూడేల్లో వివిధ రకాల పండుగలు సంప్రదాయబద్ధంగా జరుపుకుంటారు. ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీలు అకాడి పండుగలో జరిపే ఇతివృత్తంపై ‘సాక్షి’ అందిస్తున్న ప్రత్యేక కథనం..

అకాడి..

ఆషాఢమాసంలో ప్రథమంగా వచ్చే పండుగ అకాడి. పాడిపంటలకు రక్షణ కల్పించే అడవిదేవతగా భావించే రాజుల్‌పేన్‌ను పూజిస్తారు. నెలవంక కనిపించగానే జిల్లాలోని ప్రతీ గ్రామంలో దీనిని నిర్వహిస్తారు. అకాడి పండగను కొందరు పౌర్ణమి వరకు నిర్వహిస్తే మరికొందరు అమావాస్య వరకు నిర్వహిస్తారు. అనాదిగా వస్తున్న ఆచారమని ఆదివాసీ పెద్దలు, కటోడాలు పేర్కొంటున్నారు.

ప్రతీ పండుగకు ప్రత్యేకత



ఆదివాసీలు జరుపుకునే ప్రతీ పండుగకు ప్రత్యేకత ఉంది. అకాడి నుంచి ప్రారంభమైన పండుగలు నాలుగు మాసాల పాటు కొనసాగుతాయి. దీపావళికి గుస్సాడీ దీక్ష స్వీకరించే వారు ఇప్పుడే కుల దేవతలకు మొక్కుకుంటారు. కార్యం నెరవేరాక దీక్ష చేపడతారు. పూజల తర్వాత ఏత్మాసార్ పేన్‌కు పూజలు చేస్తాం. వన భోజనం ఐకమత్యాన్ని తెలియజేస్తుంది.
– కుర్సెంగ దుందేరావు, ఆదివాసీ నాయకుడు, చౌపన్‌గూడ

‘21న బంద్ విజయవంతం చేయాలి’


నినాదాలు చేస్తున్న తుడుందెబ్బ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమురం భీం కన్జర్వేషన్ కారిడార్ పేరిట తీసుకువచ్చిన జీవో 49 వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21న చేపట్టిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బంద్ విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్ కోరారు. శనివారం మావల మండలంలోని కుమురంభీం గూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1/70, పెసా చట్టాలు ఆదివాసీల అస్తిత్వాన్ని, మనుగడను, హక్కులను ఉల్లంఘిస్తున్నాయన్నారు. అన్నివర్గాల ప్రజలు, వ్యాపారులు, విద్యాసంస్థలు, సినిమా థియేటర్లు, బ్యాంకులు, పెట్రోల్ బంకులు పూర్తిస్థాయిలో బంద్‌కు సహకరించాలని కోరారు. సమావేశంలో తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిరా, డివిజన్ అధ్యక్షురాలు సోయం లలితా, ఆదిలాబాద్ డివిజన్ ఉపాధ్యక్షుడు ఆత్రం గణపతి, మావల మండల అధ్యక్షుడు వెడ్మ ముకుంద్, ఉపాధ్యక్షుడు తొడసం ప్రకాష్, కుమ్ర వినోద్, తదితరులు పాల్గొన్నారు.

పశువులను తరలిస్తున్న రెండు వాహనాలు పట్టివేత

బెజ్జూర్: అక్రమంగా పశువులు తరలిస్తున్న రెండు వాహనాలను పట్టుకున్నట్లు ఎస్సై సర్దార్ పాషా తెలిపారు. శనివారం ఉదయం బెజ్జూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వెళ్తున్న రెండు బొలెరో వాహనాలను ఆపి తనిఖీ చేయగా ఒక్కో వాహనంలో ఐదు చొప్పున పశువులు ఉన్నాయని, పెంచికల్‌పేట్ నుంచి చేద్వాయి వెళ్తున్నట్లు చెప్పారు. పశువైద్యాధికారి, గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా తీసుకెళ్తున్నట్లు గుర్తించామని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఫోన్ల రికవరీకి ప్రత్యేక బృందం ఏర్పాటు

- ఎస్పీ అఖిల్ మహాజన్
- పోగొట్టుకున్న 109 సెల్‌ఫోన్లు బాధితులకు అందజేత



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: బాధితులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి రికవరీ చేసేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. పోగొట్టుకున్న, చోరీకి గురైన రూ.16 లక్షల విలువ గల 109 సెల్‌ఫోన్లను శనివారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని సమావేశం మందిరంలో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫోన్ పోయిన వెంటనే https://www.ceir.gov.in వెబ్‌సైట్‌లో లేదా సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 900 సెల్ ఫోన్లను బాధితులకు తిరిగి అందజేసినట్లు తెలిపారు. మీసేవ కేంద్రాల్లో ఎలాంటి చలాన్లు కట్టకుండా ఫిర్యాదు చేయవచ్చన్నారు. దొంగిలించిన ఫోన్లను కొనుగోలు చేస్తే చట్టప్రకారంగా చర్యలు తీసుకుంటామని దుకాణాల యజమానులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ కమతం ఇంద్రవర్ధన్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటి, ప్రత్యేక బృందం సభ్యులు ఎస్సై పి.గోపీకృష్ణ, ఎస్.సంజీవ్, ఎం.ఏ.రియాజ్, మజీద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య, వైద్యం అందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఉమ్మడి జిల్లా ఆశ్రమ పాఠశాలల డీటీడీవో, ఏటీడీవోలు, ఏఎన్ఎంలను ఆదేశించారు. శనివారం కేబీ కాంప్లెక్స్‌లోని సమావేశ మందిరంలో ఓరియంటేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల్లో రక్తహీనత లేకుండా చూడాలన్నారు. మోవా లడ్డూ, విటమిన్ ‘సి’ పాలిక్ యాసిడ్ వంటి మాత్రలను వారంలో రెండుసార్లు మధ్యాహ్న భోజనం తర్వాత ఇవ్వాలని సూచించారు. స్నానానికి వేడి నీళ్లు ఉండేలా చూడాలన్నారు. ప్రతీరోజు విద్యార్థుల హిమోగ్లోబిన్ శాతం పరిశీలించాలని ఏఎన్ఎంలను ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలల్లో వార్డెన్లు 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ అంబాజీ, ఏడీఎంహెచ్‌వో కుడిమెత మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరు మృతి


భీమేశ్ మృతదేహం

సారంగపూర్: చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు స్వర్ణ ప్రాజెక్టులో పడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు జౌళి గ్రామానికి చెందిన పోటిండ్ల భీమేశ్ (34) శుక్రవారం సాయంత్రం స్వర్ణ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోవడంతో మృతి చెందాడు. మృతుని బంధువులు శనివారం ఉదయం ప్రాజెక్టు పరిసరాల్లో గాలించగా మృతదేహం లభ్యమైంది. కాళ్లకు వల చుట్టుకోవడంతో నీటమునిగి మృతిచెంది ఉంటాడని భావించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై శ్రీకాంత్ సంఘటనా స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసుకున్నారు. మృతునికి గతంలో వివాహమైనా విడాకులు కావడంతో ఒంటరిగానే ఉంటున్నాడని బంధువులు తెలిపారు.

చికిత్స పొందుతూ కార్మికుడు..


శ్రీనివాస్(ఫైల్)

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని స్టోర్స్‌లో జనరల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కొత్తపల్లి శ్రీనివాస్ (45)చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. తోటి కార్మికులు తెలిపిన వివరాల మేరకు గత నెలలో విధి నిర్వహణలో ఉండగా, తేనెటీగలు కుట్టడంతో స్టోర్ అధికారి సూచన మేరకు ఒక్కడే ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకుంటున్నాడు. సదరు అధికారి రమ్మని చెప్పడంతో ట్రీట్‌మెంట్ పూర్తి కాకుండానే వచ్చినట్లు సమాచారం. డిశ్చార్జ్ చేయకుండానే ఎందుకు వెళ్లావని ఆస్పత్రి సిబ్బంది అడగడంతో మళ్లీ ఆస్పత్రికి వెళ్లాడు. ఈక్రమంలో పది రోజుల క్రితం అధిక రక్తపోటుకు గురికావడంతో కేకే డిస్పెన్సరీకి వెళ్లగా రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రికి రెఫర్ చేశారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ తరలించి చికిత్స చేయించినా నయం కాకపోవడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇదిలా ఉండగా విధి నిర్వహణలో ఉండగా తేనెటీగలు కుడితే బాధితునితో పాటు మరో సహాయకుడిని ఎందుకు పంపలేదని కార్మికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు ఎదురుకాకుండా చర్యలు తీసుకోవాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

నీళ్లనుకుని పురుగుల మందు తాగిన యువకుడు

- చికిత్స పొందుతూ మృతి

సిరికొండ: ఈ నెల 15న పురుగుల మందుతాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై పూజ తెలిపారు. మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన ఆడ ప్రవీణ్‌కుమార్ (22) మంగళవారం రాత్రి పంటచేనుకు కాపలా వెళ్లాడు. దాహం వేయడంతో నిద్రమత్తులో నీళ్ల బాటిల్ అనుకుని పురుగుల మందు తాగాడు. వెంటనే ఇంటికి వచ్చి విషయం తల్లిదండ్రులకు తెలపడంతో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మొరం టిప్పర్లు పట్టివేత

దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్ సమీపంలో అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు టిప్పర్లను మైనింగ్ అధికారులు శనివా రం పట్టుకున్నట్లు తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే తెలిపారు. పట్టుకున్న టిప్పర్లను దండేపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

అప్పులబాధతో సింగరేణి కార్మికుడు ఆత్మహత్య


రమేశ్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: అప్పుల బాధతో సింగరేణి కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై మజారుద్దీన్, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు ఎస్సార్పీ–1 గనిలో కోల్‌ఫిల్లర్‌గా విధులు నిర్వర్తిస్తున్న జిల్లా కేంద్రంలోని అశోక్ రోడ్డుకు చెందిన బైరి రమేశ్ (36) తన స్నేహితుల వద్ద రూ.5 వడ్డీచొప్పున సుమారు రూ.10 లక్షల వరకు అప్పు చేశాడు. ప్రతీనెల వడ్డీ మాత్రమే కడుతున్నాడు. అసలు ఎలా చెల్లించాలో తెలియక మనస్తాపానికి గురై ఈనెల 17న గడ్డిమందు తాగాడు. ఇంటికి వచ్చి వాంతులు, విరేచనాలు చేసుకుని కిందపడిపోవడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతునికి భార్య శ్వేత, కుమారుడు ఉన్నారు. శ్వేత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఒకరు..


విశ్వేశ్వర్‌రావ్ (ఫైల్)

ఇంద్రవెల్లి: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై రమేశ్ తెలిపిన వివరాల మేరకు శంకర్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని దుబ్బగూడకు చెందిన ఆడ విశ్వేశ్వర్‌రావ్ (48) నాలుగేళ్లుగా మానసిక స్థితి కోల్పోయాడు. కుటుంబ సభ్యులు పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాలేదు. శనివారం కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లగా ఇంట్లో దూలానికి ఉరేసుకున్నాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఉట్నూర్ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య సీతాబాయి, కుమారులు యశ్వంత్‌రావ్, రాజేశ్ ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

ఇంద్రవెల్లి: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయలైన ఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల మేరకు ఈశ్వర్‌నగర్ గ్రామానికి చెందిన అందుసింగ్ బైక్‌పై ఇంటికి వెళ్తుండగా ఉట్నూర్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. కారు ఆగకుండా వెళ్లిపోవడంతో విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే గుడిహత్నూర్ పోలీసులకు సమాచారం అందించడంతో కారును అదుపులో తీసుకుని ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తీవ్రగాయాలైన అందుసింగ్‌ను స్థానికులు వెంటనే 108లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. ఈ విషయంపై ఏఎస్సై రమేశ్‌ను సంప్రదించగా ఘటనపై ఇప్పటి వరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు.

ఇన్నోవేషన్ వ్యవస్థలో విద్యార్థుల పాత్ర కీలకం

- ఓఎస్డీ, ఏవో ప్రొఫెసర్ మురళీదర్శన్


మాట్లాడుతున్న ఓఎస్డీ మురళీదర్శన్

బాసర: భారత ఇన్నోవేషన్ వ్యవస్థలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని ఓఎస్డీ, ఏవో ప్రొఫెసర్ మురళీదర్శన్ అన్నారు. శనివారం ఆర్జీయూకేటీలో విద్యార్థులకు స్టార్టప్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ మార్గదర్శక విలువలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలలో ప్రధానంగా ప్రారంభ దశ స్టార్టప్‌లలో ఎదురయ్యే సవాళ్లను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో స్టార్టప్‌లపై ఆసక్తిని పెంపొందించాలనే లక్ష్యంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థిరత్వం, విస్తరణ ప్రాముఖ్యతలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. కళాశాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్వాతి, నాగసాయి కుమార్, దిల్బహర్ అహ్మద్, చరణ్‌రెడ్డి, వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్యాడ్మింటన్ పోటీలు


పరిచయం చేసుకుంటున్న శ్రీకాంత్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రం శివారులోని కొండాపూర్ వద్దగల నిర్మల్ స్పోర్ట్స్ అకాడమీలో మంచిర్యాల జిల్లా స్టార్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు మూడో రోజు రసవత్తరంగా సాగాయి. శనివారం క్వార్టర్ ఫైనల్స్ నిర్వహించారు. అండర్ 19 బాలురు, బాలికలకు సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో పోటీలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఫైనల్ పోటీలు నిర్వహించనుండగా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి, నిర్మల్ అర్బన్ ఎమ్మార్వో రాజు, మున్సిపల్ డీఈ హరిభువన్, మంచిర్యాల జిల్లా స్టార్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముఖేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ కిషోర్, కో కన్వీనర్ వన్నెల భూమన్న, కోఆర్డినేటర్లు సందీప్, మధుకర్ గౌడ్, నందకుమార్, తదితరులు పాల్గొన్నారు.

నా ఎదుగుదలను ఓర్వలేకే దుష్ప్రచారం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

కైలాస్‌నగర్: రాజకీయంగా తన ఎదుగుదలను ఓర్వలేకనే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పెన్‌గంగా గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మైక్రోఫైనాన్స్‌లో ఉద్యోగాల పేరిట నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసి నిందితుడు పరారైన ఘటనకు సంబంధించి తనపై జరుగుతున్న ప్రచారంపై వివరణ ఇచ్చారు. నిందితుడు తనకు స్నేహితుడేనని, కలిసి చదువుకున్నామన్నారు. అయితే నిందితుడి ఫౌండేషన్‌కు తన ఫౌండేషన్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. తాను ఎమ్మెల్యే కావడం జీర్ణించుకోలేని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియా, పత్రికలు, యూట్యూబ్ చానళ్లలో తనపై తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని ఆరోపించారు. ఇందుకు బాధ్యులైన వారికి లీగల్ నోటీసులు జారీ చేయడంతో పాటు ఎస్పీకి ఫిర్యాదు చేస్తానన్నారు. మోసపోయిన గిరిజన యువతకు న్యాయం చేసేలా తనవంతు కృషి చేస్తానని వెల్లడించారు.

అటవీ అధికారి లంచం తీసుకున్నాడని వీడియో వైరల్

గుడిహత్నూర్ : హర్కాయికి చెందిన అటవీ బీట్ ఆఫీసర్ రూ.20 వేలు లంచం తీసుకున్నట్లు వీడియో వైరల్‌గా మారింది. మండలంలోని కొల్హారీ గ్రామానికి చెందిన వడ్రంగి ఎనుగుర్తి సురేష్ తన ఇంట్లో ఉన్న పాత కలపతో ఇంటి కోసం కిటికీలు, తదితర సామగ్రి తయారు చేస్తుండగా ఓ అజ్ఞాత వ్యక్తి సమాచారంతో వెళ్లిన బీట్ ఆఫీసర్ విశ్వజిత్ వాటిని పరిశీలించి రూ.20వేలు జరిమానా విధించాడు. దీంతో ఈ నెల 15న సురేష్ సదరు అధికారికి డబ్బులు చెల్లించి రశీదు పొందాడు. ఈ తతంగాన్ని ఓ వ్యక్తి వీడియో తీయగా అది లంచం ఇస్తున్నట్లు వక్రీకరించడంతో ఈ విషయం వైరల్‌గా మారింది. కాగా అటవీ అధికారి వడ్రంగికి ఇచ్చిన రశీదుపై ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ అని రాసి ఉంది. ఈ విషయమై జిల్లా అటవీ అధికారిని వివరణ కోరగా ఏపీ, తెలంగాణ ఫారెస్ట్ రూల్స్ ఒకేలా ఉండడం వల్ల గతంలో ప్రభుత్వం వీటిని కొనసాగించడానికి వెసులుబాటు కల్పించిందన్నారు.

కలప స్వాధీనం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని పిప్పల్‌ధరి గ్రామ పంచాయతీ పరిధిలోని దహిగూడలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన 38 కలప దుంగలను శనివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన గంటుబాయి నివాసంలో దాడులు నిర్వహించగా కలప లభ్యం కావడంతో స్వాధీనం చేసుకుని గంటుబాయి, మీరాబాయి, దస్రూపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం నిందితులు పరారీలో ఉన్నారన్నారు.

బెల్టుషాపు నిర్వాహకులపై కేసు

ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రాంపూర్‌లో బెల్టుషాపులు నిర్వహిస్తున్న బెజ్జవార్ కిషన్, దర్శనాల రాజుపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.